



క్యూలో బారులు తీరిన భక్తులు

లష్కర్‌వారం బుకింగ్ ఆదాయమూ తగ్గింది

- గతేడాది రూ.59.71 లక్షలు
- ఈ సారి రూ.43.16 లక్షలు

చేర్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా లష్కర్ వారాన్ని పురస్కరించుకుని భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అయితే, పట్నంవారం మాదిరిగానే రెండో వారమూ బుకింగ్ ఆదాయం భారీగా తగ్గింది. భక్తులు మొక్కుబడులుగా సమర్పించిన తలనీలాలు, నిర్వహించిన ఆర్జిత సేవలు, రచించిన పట్నాలు, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, వసతిగదుల అద్దె తదితరాల ద్వారా శనివారం రూ.4,75,721, ఆదివారం రూ.29,76,333, సోమవారం రూ.8,64,223 చొప్పున రూ.43.16,277 ఆదాయం సమకూరింది. గతేడాది లష్కర్‌వారం సందర్భంగా మూడు రోజుల్లో రూ.59.71లక్షలమేర ఆదాయం రాగా, ఈసారి రూ.16.55 లక్షల మేర తగ్గింది. మొదటి వారమైన పట్నం వారం సుమారు రూ.9లక్షలు లోటు రాగా, రెండవవారం కూడా రూ.16.55లక్షలు తగ్గడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నిర్మలాజగ్గారెడ్డి

రికార్డ్ స్థాయిలో పెట్టుబడులు తెచ్చినందుకు శుభాకాంక్షలు తెలిపిన టీజీఐఐసీ చైర్‌పర్సన్



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిర్మలాజగ్గారెడ్డి



సీఎంతో పాటు మంత్రులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : దావోస్ నుంచి రికార్డు స్థాయిలో పెట్టుబడులు తెచ్చిన సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, ఎంపీ అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఉపాధి పునరావాసం పథకానికి దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఉపాధి పునరావాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీకాంతరెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2024-25కి గాను పూర్తి సబ్సిడీతో బ్యాంకు లింకేజీ లేకుండా ఒక్క యూనిట్ రూ.50వేల చొప్పున జిల్లాకు 30యూనిట్లు మంజూరు చేసిందని అర్హులైన దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సదరం సర్టిఫికెట్‌లో 40 శాతం పైగా ఉన్న దివ్యాంగులు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల ఆదాయ పరిమితి ఉన్న దివ్యాంగులు ఫిబ్రవరి 2వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.



చిన్నకోడూరు మండలం మెట్టుపల్లిలో టమాటా పంటను మేస్తున్న పశువులు

టమాటా ఢమాల్

- కూలీల, రవాణా ఖర్చులు సైతం రాని వైనం
- చేనులోనే పశువులను మేపుతున్న రైతులు

చిన్నకోడూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): టమాటా రైతులకు యేటా నష్టాలు తప్పడం లేదు. మార్కెట్‌లో ధర బాగుంటే పంట పం డదు. పంట బాగా పండితే మార్కెట్‌లో ధర ఉం డదు. ప్రస్తుతం టమాటా సాగు చేసిన రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. మార్కెట్‌లో హోల్‌సేల్‌గా కిలో టమాట రూ.4నుంచి రూ.5వరకు అమ్ముడవుతుంది.

ధర లేక రైతుల ఆవేదన

చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు టమాటా సాగు చేశారు. అందుకు రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టారు. పంట ఏపుగా పెరిగి దిగుబడి బాగా వచ్చింది. మార్కెట్‌కు టమాటా డిమాండ్ కంటే ఎక్కువ వస్తుండడంతో రేటు పడిపోయింది. గత సెప్టెంబర్‌లో మార్కెట్‌లో కిలో టమాటా రూ. 16 ఉండగా, నెల చివరన రూ.50 అయింది. అక్టోబరులో రూ. 45, నవంబరులో రూ.20 ఉండగా డిసెంబరు నుంచి మార్కెట్‌లో కిలో టమాటా ధర రూ.10 ఉంది. పంటను మార్కెట్‌కు తీసుకెళ్తే కనీసం కూలీల, రవాణా ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో రైతులు పంటను చేనులోనే వదిలేసి పశువులను మేపుతున్నారు. మరికొంత మంది రైతులు టమాటా పంటను తీసేసి వేరే పంటలను సాగు చేస్తున్నారు. కాసుల వర్షం కురిపిస్తుందనుకున్న టమాట ధర లేక దు:ఖాన్ని మిగిల్చిందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.



పశువులను మేపుతున్నా



1.5 ఎకరాల్లో టమాటా సాగు చేశాను. రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టాను. ధర లేకపోవడంతో మార్కెట్‌కు తీసుకెళ్తే కూలీల, రవాణా ఖర్చులు రాక పోగా చేతినుంచే ఖర్చు చేయాల్సి వస్తుంది. అందుకే పంటను చేను లోనే వదిలేసి పశువులను మేపుతున్నాను.

- కొరిమి రాజు, రైతు, మెట్టుపల్లి

గిట్టుబాటు కాక తీసేశాను



అరెకరంలో టమాటా సాగు చేశాను. సాగుకు సుమారు రూ.25వేలు ఖర్చు అయ్యాయి. టమాటాకు రేటు లేకపోవడంతో పెట్టుబడి కూడా రాలేదు. చేసేదేమీ లేక టమాట చేనును తీసేసి మొక్కజొన్న సాగు చేశాను.

-కనుగుల నాగరాజు, రైతు, చిన్నకోడూరు

మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ఐబీ గిరిజన తండాలో సర్కారు ఉద్యోగి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థినికి ఆత్మీయ భరోసా అందింది. పెళ్లికాని ముగ్గురు అమ్మాయిలకూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో చోటు దక్కింది. మంజూరు పత్రాలు కూడా తీసుకున్నారు.

సంగారెడ్డి జిల్లా చెర్ల గోపులారంనకు చెందిన ఓ వ్యక్తి పేరిట దాదాపు 20 ఎకరాల సాగుభూమి, భవంతులు ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఈ వ్యక్తికి చోటు దక్కింది. ఇక అమెరికాలో ఉంటున్న ఓ వ్యక్తి కుటుంబ సభ్యులనూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేశారు.

సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఇందిరమ్మ ఇల్లు, మరొకరికి రేషన్‌కార్డు జాబితాలో పేర్లు వచ్చాయి. ఇదే మండలం పెద్దరాజుపేట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు రేషన్‌కార్డులు మంజూరైనట్లుగా గ్రామసభల్లో చదివి వినిపించారు. దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్‌లో జాబ్‌కార్డులు లేనివారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, వ్యవసాయ భూములు ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు వచ్చాయి. అనర్హుల ఎంపికపై గ్రామానికి చెందినవారు అధికారులను నిలదీశారు.

ఉమ్మడి జిల్లాల్లో సంక్షేమ పథకాల అర్హులు ఇలా ఉన్నారు. నాలుగు రోజుల పాటు అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసినా పథకాల ప్రారంభోత్సవం రోజునే అనర్హులకు దక్కాయి. ఇంత కసరత్తు చేసి మండలానికి ఒక గ్రామంలో మంజూరు పత్రాలను ఇస్తేనే అనర్హులకు అందాయంటే, పూర్తిస్థాయిలో పథకాలు అమలైతే పరిస్థితి ఏంటో చూడాలి.



ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా జాబితాలో పేర్లు లేవని బెజ్జంకి మండలం వీరాపూర్‌కు చెందిన మహిళల నిరసన

పథకాలు.. అనర్హులకు

సంక్షేమ పథకాల జాబితాలో శ్రీమంతులు
ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎంపికపై విమర్శలు

- ప్రభుత్వ ఉద్యోగులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు
- ఎన్ఆర్ఐ కుటుంబాలకు, ఇంటర్ విద్యార్థులకు ఆత్మీయ భరోసా
- భూములు, భవంతులు, ఉద్యోగాలు ఉన్నా రేషన్‌కార్డులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 28 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు పొందేవారిలో అనర్హులు తేలుతున్నారు. రాష్ట్ర నేతల దగ్గరి నుంచి గ్రామ నాయకుల వరకు, ఉన్నతాధికారి నుంచి జిల్లా అధికారుల వరకు అర్హులకే పథకాలను అందజేస్తామని పదేపదే చెప్పారు. కానీ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లోనూ అనర్హులకే మంజూరు పత్రాలు చేరాయి. ఈ ప్రాతిపదికన అర్హుల ఎంపిక ఎలా జరిగిందోనని అయోమయం నెలకొంది. అర్హుల ఎంపికపై నిర్వహించిన గ్రామసభల్లో అనర్హులపై వివాదాలు తలెత్తిన విషయం తెలిసిందే. అయినప్పటికీ క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామని, అర్హులకే లబ్ధి చేకూరుతుందని అధికారులు చెప్పుకొచ్చారు.



ఆత్మీయ భరోసాలో అనర్హుల పేర్లున్నాయని ఫిర్యాదు చేస్తున్న కంది మండలం మక్తఅల్లూరు గ్రామస్థులు

తండ్రుల పేరిట భూములు.. కుమారులకు ఆత్మీయ భరోసా

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ప్రతీఏటా రూ.12వేల సహాయం అందుతుంది. ఉపాధిహామీకి సంబంధించిన జాబ్‌కార్డు ఉండడంతోపాటు కనీసం 20 రోజుల పనిదినాలు చేసి ఉండాలి. ఇందులోనూ భూమిలేని నిరుపేదలకు తొలి ప్రాధాన్యతగా భరోసా డబ్బులు ఇవ్వాలి. కానీ సొంత ఇల్లు, భవంతులు ఉన్నవారికి చాలాచోట్ల భరోసా అందింది. తండ్రుల పేరిట ఎకరాల కొద్దీ భూములు

మిగతా 7వ పేజీలో

మూడు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైన గ్రామాల్లో పథకాల లబ్ధిదారుల వివరాలు

నియోజకవర్గం	గ్రామాలు	ఇందిరమ్మ ఇళ్లు	ఆత్మీయ భరోసా
జహీరాబాద్	5	1,027	356
దుబ్బాక	7	984	174
నర్సాపూర్	8	675	277
మెదక్	6	565	202
సంగారెడ్డి	4	528	124
అందోలు	8	11,95	119
గజ్వేల్	9	833	247
సిద్దిపేట	5	544	126
పటాన్‌చెరు	4	213	22
నారాయణఖేడ్	7	900	249
హుస్నాబాద్	7	910	207

'పది' పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో జిల్లాలోని విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికబద్ధంగా వారిని సన్నద్ధం చేయాలని కలెక్టర్ మనుచౌదరి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మార్చి 21 నుంచి ప్రారంభంకానున్న పదోతరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడం కోసం ప్రభుత్వ పాఠశాలలు, ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్ కేజీబీవీల ప్రత్యేకాధికారులతో విద్యాశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల వారీగా పదోతరగతి పరీక్షల్లో పూర్తిస్థాయిలో ఉత్తీర్ణత సాధించడం కోసం ఆయా పాఠశాలలు అనుసరిస్తున్న విధానాన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. పదోతరగతి ఫలితాల్లో ఈ సంవత్సరం కూడా జిల్లాను పైభాగంలో నిలవాలన్నారు. పరీక్షలకు ఇంకా నెలన్నర సమయం ఉన్నందున ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతీరోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక సమయం కేటాయించి వెనుకబడిన విద్యార్థులను ఒక ఉపాధ్యాయుడు దత్తత తీసుకుని చదివించాలని సూచించారు. అదనపు సమయాల్లో చదివిస్తున్నందున విద్యార్థుల స్నాక్స్‌కోసం రూ.25లక్షలు అందిస్తానని చెప్పారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మొత్తంగా 10815 మంది పదోతరగతి విద్యార్థులు ఉన్నారని, వారందరూ ఉత్తీర్ణత సాధించేలా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో ప్రైవేటు స్కూళ్లలో 3,309 మంది విద్యార్థులు 10వ తరగతి చదువుతున్నారని అన్నారు. సమావేశంలో జిల్లా ఉమ్మడి పరీక్ష సెక్రటరీ షౌకత్ అలీ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మయ్య, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి, మండల విద్యాశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సజావుగా సాగాలి : అదనపు కలెక్టర్

సిద్దిపేటకల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 3 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభంకానున్న నేపథ్యంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఇంటర్మీడియట్ పరీక్షల కమిటీ, వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, పోలీస్, వైద్య, విద్యుత్, పాఠశాల విద్య, పోస్టల్‌శాఖలకు సంబంధించిన జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి సమన్వయ సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు జరిగే ప్రాక్టికల్స్‌కు జిల్లావ్యాప్తంగా 62 కేంద్రాలకు గానూ 5,909 మంది జనరల్, 5,182 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. మార్చిలో జరిగే వార్షిక పరీక్షల్లో ప్రథమ సంవత్సరంలో 9,770 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 10,875 మంది పరీక్షలు రాస్తారని తెలిపారు. వీరి కోసం జిల్లావ్యాప్తంగా 43 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు రవీందర్‌రెడ్డి అధికారులకు వివరించారు.

ఎట్టకేలకు కూడవెల్లి వాగులోకి నీటి విడుదల



గజ్వేల్‌రూరల్, జనవరి28(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామం కూడవెల్లి వాగులోకి మల్లన్నసాగర్ నీటిని విడుదల చేశారు. మంగళవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు తక్షణమే నీటిని విడుదల చేశారు. కొంతకాలంగా రైతులు నీటి కోసం ఎదురుచూస్తున్నారు. 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. సుమారు 50వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. కొడకండ్లలో మల్లన్నసాగర్ కాలువ లింక్ గ్రావిటీ కెనాల్ ద్వారా నీరు కూడవెల్లి వాగులోకి చేరుతుంది. నీటిని విడుదల చేయడంతో బీఆర్ఎస్ నాయకులు హ ర్షం వ్యక్తం చేశారు. రైతులు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కూడవెల్లి రామలింగేశ్వరాలయ చైర్మన్ ఎన్నికపై ఆందోళన

- రాజిరెడ్డి నియామకంపై స్థానికుల ఆగ్రహం
- అసంతృప్తితో మండల కాంగ్రెస్ నాయకులు దూరం
- ఆరుగురు సభ్యులతో ప్రమాణస్వీకారం
- చైర్మన్ ఎన్నికను వాయిదా వేసిన అధికారులు

దుబ్బాక, జనవరి28 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి, కూడవెల్లి రామలింగేశ్వరాలయ నూతన కమిటీ చైర్మన్‌గా దుబ్బాక మున్సిపల్ చేర్వాపూర్ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు ఉషయ్యగారి రాజిరెడ్డిని నియమిస్తున్నట్టు తెలియడంతో ఆలయం వద్ద బుధవారం రాత్రి ఉద్రిక్తత నెలకొన్నది. ఏడుగురు సభ్యులతో ఆలయ పాలకమండలిని నియమిస్తున్నట్లు దేవాదాయశాఖ కమిషనర్ బుధవారం ప్రకటించారు. కమిటీ ప్రమాణస్వీకారం బుధవారం రాత్రి ఆగమేఘాల మీద చేపట్టారు. ఆరుగురు సభ్యులతో కూడిన పాలకమండలి ప్రమాణస్వీకారాన్ని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి ప్రమాణస్వీకారం చేయించారు. ఒకరు మాత్రం గైర్హాజరయ్యారు. అయితే, నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం వ్యవహారం తెలియడంతో అక్బర్‌పేట- భూంపల్లి మండల కాంగ్రెస్ నాయకులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆలయకమిటీలో స్థానికులకే ఇవ్వాలంటూ వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పార్టీలకు అతీతంగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ కమిటీలో ఎక్కువ శాతం పాత పోతరెడ్డిపేట రెవెన్యూ గ్రామానికి చెందిన పోతరెడ్డిపేట, తాళ్లపల్లి, నగరం, రామేశ్వరంపల్లి, చిన్ననిజాంపేట గ్రామాలకు చెందిన వారే ఉండేవారు. జాతర ఏర్పాట్లతో పాటు అభివృద్ధికి ఆయా గ్రామాల ప్రజల భాగస్వామ్యంతో సాగడం పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తుంది. అయితే, దుబ్బాక మున్సిపల్‌కు చెందిన రాజిరెడ్డిని నియమించడంపై మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆగమేఘాల మీద సాగుతున్న ప్రమాణస్వీకారాన్ని అడ్డుకుంటామని ఆందోళన చేపట్టారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్ పోలీస్ బందోబస్తుతో అక్కడికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. ఆలయ పాలకమండలి ఆరుగురు సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్ ఎన్నికకు పదిరోజుల వ్యవధి ఉంటుంది. అందుకు నోటిఫికేషన్ జారీ చేయాలి. సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికను చేపట్టిన పక్షంలో చైర్మన్‌ను ప్రకటించే అవకాశం ఉంది. అయితే, ఆలయ పరిసరాల్లోని ఉద్రిక్తత పరిస్థితి దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రమాణ స్వీకారం జరిగే చోటుకు ఇతరులను ఎవరినీ అనుమతినివ్వలేదు. ఉద్రిక్తతల నడుమ చైర్మన్ ఎన్నికను వాయిదా వేసినట్టు దేవాదాయ శాఖ ఇనిస్పెక్టర్ విజయలక్ష్మి ప్రకటించారు. దీంతో స్థానికుల ఆందోళనను విరమించారు.



ఆలయకమిటీ పాలకమండలి నియామకంపై ఆందోళన చేపడుతున్న స్థానికులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

జగదేవ్‌పూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని ఐసీడీఎస్ అధికారులు హెచ్చరించారు. మంగళవారం జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో బాల్య వివాహం జరుగుతుందని తెలుసుకున్న అధికారులు అక్కడికి వెళ్లి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాలికల పెళ్లికి సహకరించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారులు, షీటీం బృందం, ఆర్ఐ, చైల్డ్ లైన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్ల వయస్సులోనే కిలిమంజారోపైకి..

● పర్వతారోహకుడికి గవర్నర్ ప్రశంస

ధూళిమిట్ట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం హనుమతండా గ్రామానికి చెందిన చెందిన బాలుడు జాటోత్ విహన్‌రామ్(8) గతవారం ఆఫ్రికా దేశంలోని అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాడు. చిన్న వయస్సులో పలు ఎత్తైన పర్వతాలను అధిరోహిస్తున్న బాలుడిని మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాజ్‌భవన్‌కు పిలిపించుకుని అభినందించారు. ఈ సందర్భంగా విహన్‌రామ్ తాను వచ్చే నెలలో ఆస్ట్రేలియాలోని కోషియాస్కో పర్వతాన్ని అధిరోహించనున్నట్లు తెలిపారు. బాలుడి తండ్రి తిరుపతినాయక్ అబ్కారీశాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కార్యక్రమంలో బాలుడి కోచ్ మహిపాల్ రెడ్డి, తల్లితండ్రులు వాణి, తిరుపతి నాయక్, స్పాన్సర్ గుగులోత్ రజిత, తదితరులు పాల్గొన్నారు.



విహన్‌రామ్‌ని అభినందిస్తున్న గవర్నర్

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం

● రూ.5 లక్షల నష్టం



దగ్ధమవుతున్న స్క్రాప్ దుకాణం

నారాయణఖేడ్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలోని చంద్రయ్యకు చెందిన పాత ఇనుప సామగ్రి(స్క్రాప్) దుకాణంలో మంగళవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గమనించిన స్థానికులు యజమానికి చెప్పడంతో ఆయన అక్కడికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో వచ్చి మంటలు ఆర్పేలోగా సామగ్రి మొత్తం కాలిపోయి జరుగాల్సిన నష్టంజరిగింది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. బాధితుడు ఫిర్యాదుతో డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్ సందర్శించి పంచనామ నిర్వహించారు. రూ.5 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

రావి ఆకులపై పద్మ అవార్డు గ్రహీతల చిత్రాలు

నారాయణఖేడ్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పద్మ అవార్డు గ్రహీతలకు వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపాడు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్. రావి ఆకులపై అవార్డుల గ్రహీతలైన డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి, నందమూరి బాలకృష్ణ, మందకృష్ణ మాదిగల చిత్రాలను చిత్రాలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.



మాఘ అమావాస్య స్నానం..
సర్వపాపహరణం

- ముస్తాబైన ఆలయాలు
- నేటి నుంచి కూడవెల్లి

రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు

దుబ్బాక, జనవరి28(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరొందిన అక్బర్‌పేట- భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలోని కూడవెల్లి రామలింగేశ్వరాలయం మాఘ అమావాస్య జాతరకు ముస్తాబైంది. మంగళవారం దేవుడి ఊరేగింపుతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. బుధవారం మాఘ అమావాస్యను పురస్కరించుకుని కూడవెల్లివాగులో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. ఇందుకోసం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చొరవతో మల్లన్నసాగర్ ద్వారా నీటిని కూడా విడుదల చేశారు. వాగులో నీటి నిల్వతో దేవాలయం చుట్టూ పర్యాటక శోభ సంతరించుకున్నది. తూర్పు నుంచి పెద్దవాగు, పడమర నుంచి చిన్నవాగు, మధ్య వాగులతో అనుసంధానంగా కలయికతో ఏర్పడిన కూడవెల్లి వాగులో మాఘ అమావాస్య రోజున పుణ్యస్నానం ఆచరిస్తే పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం. వాగులో స్నానాలు ఆచరించే సమయంలో ప్రమాదాలు సంభవించకుండా అన్నీ ఏర్పాటు చేశారు.

ఏడుపాయలలో..

పాపన్నపేట : మాఘ అమావాస్య ఉత్సవాలకు ఏడుపాయల సిద్ధమవుతున్నది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఏడుపాయలుగా చీలిన మంజీర నదిలో పుణ్య స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకోవడం ప్రజల ఆనవాయితీ. భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా అన్నీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఈవో, మెదక్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రావు మంగళవారం పేర్కొన్నారు. చెక్‌డ్యాం, అమ్మవారి ఆలయం వద్ద షవర్లు, బట్టలు మార్చుకోవడానికి తాత్కాలిక గదులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మెదక్ డీఎస్పీ పర్యవేక్షణలో 231 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.

కొప్పోల్ ఆలయంలో..

పెద్దశంకరంపేట : మాఘ అమావాస్య ని పురస్కరించుకొని పెద్దశంకరంపేటమండల పరిధిలోని శ్రీ కొప్పోల్ ఉమా సంగమేశ్వర దేవాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ కోనేటిలో పవిత్ర స్నానాల ఆచరించిస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు

ముస్తాబైన 'కొడకంచి'

జిన్నారం, జనవరి, 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడకంచిలో ఆదినారయణ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు మస్తాబైంది. శ్రీదేవి, భూదేవి సమేతంగా వెలిసిన ఆదినారయణుడి ఉత్సవాలను ఫిబ్రవరి 1నుంచి 10 వరకు వరకు నిర్వహించనున్నారు.ఇక్కడున్న బంగారు బల్లుల విగ్రహాలు అతి ముఖ్యమైనవి. తమిళనాడులోని కంచిలోని బంగారు బల్లుల తరహాలో ఈ ఆలయం లోపల వీటిని ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో ముఖ్య ముఖ్యఘట్టాలైన స్వామి వారి కల్యాణోత్సవం 4న, రథోత్సవం 8న, 10న ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా బ్రహ్మోత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ అల్లాని రామాజీ రావు తెలిపారు.

నేడే గుబ్బడి గుట్ట జాతర

నంగునూరు : మాఘ అమావాస్య రోజున పాలమాకులలో జరిగే గుబ్బడి గుట్ట జాతరకు దత్తాత్రేయుని ఆలయం ముస్తాబైంది. నాలుగు గ్రామాల శివారులో ఉన్న ఆలయాన్ని సంవత్సరానికి ఒకరోజు మాత్రమే తెరిచి సాయంత్రం మూసివేయడం ఇక్కడి ప్రత్యేకత. ఆలయ ప్రాంగణంలో హరి నామం ఆకారంలో వెలసిన పవిత్ర గుండంలో స్నానం చేసి స్వామిని దర్శనం చేసుకుంటే పీడ బాధలు తొలుగుతాయని గ్రామస్థుల నమ్మకం.

రేపటి నుంచి..

చేర్యాల : చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలోని నారసింహీ గురుస్థానం భువనేశ్వరీ మందిరం అత్యంత మహిమాన్విత క్షేత్రంగా అలరారుతుంది. ఏటా మాఘశుద్ధ పాడ్యమిని పురస్కరించుకుని శైశిర మాఘ నవరాత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలో రేపటినుంచి 11రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. అన్నీ ఏర్పాట్లు చేపట్టినట్లు నిర్వహకులు తెలిపారు.

కేసీఆర్‌కు ప్రజలు వీఆర్ఎస్ ఇచ్చారు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి ముఖం చాటేసిన బీఆర్ఎస్
- పోటీ విషయంపై కేసీఆర్, కేటీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలి
- గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఖర్చు రూ.50 కోట్లు..!
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్, కేసీఆర్‌కు వీఆర్ఎస్ ఇచ్చారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. మంగళవారం మెదక్ టీఎన్జీవో భవన్ వద్ద ఆయన మాట్లాడుతూ.. ఉద్యమగడ్డ కేసీఆర్ సొంత మెదక్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకొని ముఖం చాటేసిందని బీఆర్ఎస్‌పై ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని, టీఎన్జీవో ఉద్యమాన్ని బాగా నడిపించామని, బీఆర్ఎస్ నేతలు గొప్పలు చెబుతున్నారని, చివరికి ఎన్నికల్లో పోటీ చేసేందుకు సొంత జిల్లాలో కేసీఆర్‌కు ఒక్క అభ్యర్థి కూడా లేకుండా పోయాడా అని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పక్క పార్టీ వ్యక్తిని బీఆర్ఎస్ అభ్యర్థిగా నిలిపిందని, ఆయనను గెలిపించేందుకు రూ. 50 కోట్లు ఖర్చు పెట్టి, నియోజకవర్గానికి ఒక ఎమ్మెల్యేను ఇన్‌చార్జిగా పెట్టినా దిక్కు లేకుండా పోయిందని విమర్శించారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ తోక ముడిచిందని, సొంత జిల్లాలో పోటీ నుంచి ఎందుకు తప్పుకున్నారో ప్రజలకు కేసీఆర్, యువరాజు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవీప్రసాద్ లాంటి వ్యక్తికి ఎమ్మెల్సీ టికెట్ ఎందుకు ఇవ్వరని ఆయన నిలదీశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉండటమే రాష్ట్రంలో ఆ పార్టీ పని అయిపోందనవడానికి నిదర్శనమన్నారు. విద్యావేత్తలు, మేధావులు ఎప్పుడు బీజేపీ పక్షాన ఉంటారని, పోటీకి బీఆర్ఎస్ తోక ముడవడంతో మూడు స్థానాల్లో బీజేపీ విజయం నల్లేరు మీద నడకేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని వ్యక్తి మృతి



వెంకటేశ్ మృతదేహం

వర్గల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వర్గల్ మండలం నాచారం గ్రామానికి చెందిన కొత్తపల్లి వెంకటేశ్(48) తూప్రాన్‌కు వెళ్లి నాచారం గ్రామానికి తన ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్నాడు. అనంతగిరిపల్లి గ్రామ శివారు ప్రాంతంలోని తూప్రాన్ గజ్వేల్ రహదారి మూలమలుపు వద్దకు రాగానే గజ్వేల్ వైపు నుంచి వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పొలంలో జారిపడి యువ రైతు..



చేతన్ కుమార్ మృతదేహం

మాసాయిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పొలంలో జారిపడి యువ రైతు మృతి చెందాడు. వెల్దుర్తి ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట మండలం హకీంపేటకు గ్రామానికి చెందిన రైతు చేతన్ కుమార్(35) మంగళవారం ఉదయం తన పొలం గట్లు తిరుగుతూ నీరు పెడుతున్నాడు. ప్రమాదవశాత్తు జారి పొలంలో పడిపోయి బురదలో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత..

రామచంద్రాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన సర్వేరీయా కత్తూర్(20) జహంగీర్ ప్రేమించి వివాహం చేసుకున్నారు. ఏడాదిన్నర క్రితం ఈ దంపతులు స్థానికంగా ఉన్న సిగ్నిచర్ హోమ్స్ నిర్మాణ సంస్థలో పనిచేస్తూ లేబర్ షెడ్లలో నివాసముంటున్నారు. ఈ నెల 26వ తేదీ రాత్రి సర్వేరీయా కత్తూర్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. దీన్ని గమనించిన ఇరుగు పొరుగువారు గుర్తించి ఆమెను కిందకు దింపి కాపడారు. మరుసటి రోజు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందిగా ఉందని చెప్పడంతో భర్త జహంగీర్ స్థానికంగా ఉన్న ప్రవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. చికిత్సకు ఎక్కువ డబ్బులు అవుతాయని ఆసుపత్రి వర్గాలు చెప్పడంతో అక్కడి నుంచి ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మంగళవారం మృతి చెందింది. భర్త నుంచి సమాచారం అందుకున్న పోలీసులు మృతురాలి తల్లిదండ్రులను విషయాన్ని చేరవేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దేవేందర్ తెలిపారు.

లింక్‌పై క్లిక్.. రూ.39 వేలు గల్లంతు

రామచంద్రాపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఫ్లిప్‌కార్ట్ నుంచి వచ్చిన లింకును ఓపెన్ చేయడంతో ఓ యువకుని బ్యాంకు ఖాతా నుంచి 30 సెకన్ల వ్యవధిలోనే రూ.39 వేలు గల్లంతయ్యాయి. దీంతో సదరు యువకుడు కొల్లూరు పోలీసులను మంగళవారం ఆశ్రయించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బెల్ ఎంఐజీ ఫేజ్-2, విద్యుత్‌నగర్‌లో నివాసముంటున్న మహేశ్ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం అతని ఫోన్‌కు ఫ్లిప్‌కార్ట్ నుంచి లింక్‌లు వచ్చాయి. దాన్ని మహేశ్ పట్టించుకోలేదు. కుటుంబ సభ్యులు ఏదేని వస్తువు బుక్‌చేసి ఉంటారన్న తలంపుతో ఇంటికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నాడు. వారు ఎటువంటివి బుక్‌చేయలేదని తెలిపారు. దీంతో మహేశ్ తన ఫ్లిప్‌కార్ట్ అకౌంట్‌లో లాగిన్ అయి లింక్ ఓపెన్ చేసిచూడగా వెంటనే తన బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు డెబిట్ అయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో సీఐ రవీందర్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ సురేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నవోదయ పాఠశాలను ఖేడ్‌లోనే ఏర్పాటు చేయాలి

నారాయణఖేడ్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సంగారెడ్డి జిల్లాకు నూతనంగా మంజూరు చేసిన జవహర్ నవోదయ పాఠశాలను జిల్లాలోనే అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్న నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి 9 పాఠశాలలను కేంద్రం మంజూరు చేసింది. ఇందులో ఒకటి సంగారెడ్డి జిల్లాకు కేటాయించగా, ఖేడ్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని ఇప్పటికే జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ కేంద్ర విద్యాశాఖ మంత్రి జయంత్‌చౌదరిని స్వయంగా కలిసి విన్నవించారు. స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి కూడా పాఠశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కూడా అప్పగిస్తామని చెప్పారు. అందోల్ నియోజకవర్గంలో జేఎన్‌టీయూ కళాశాల, సంగారెడ్డిలో ఐఐటీ, పటాన్‌చెరులో పలు ఇంజనీరింగ్ కళాశాలలు, జహీరాబాద్ కేవీ, ఇతర కాలేజీలు ఉన్నాయని, నారాయణఖేడ్‌లో పెద్దగా విద్యాసంస్థలు లేనందున నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయించాలని ఈ ప్రాంత ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.



కేంద్ర విద్యాశాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్(ఫైల్)



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

బోనమెత్తి... శిగాలూగుతూ..

- కొండపోచమ్మ ఆలయంలో భక్తుల సందడి



జగదేవ్‌పూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపోచమ్మ జాతర గతవారం ప్రారంభం కాగా, ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. మంగళవారం వేలమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించడంతో ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. కొత్త కుండలో నైవేద్యం వండి బోనాన్ని చక్కగా అలకరించారు. అనంతరం మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకుని డప్పుచప్పుళ్ల మధ్య నాట్యం చేస్తూ ఊరేగింపుగా అమ్మవారి చెంతకు తీసుకెళ్లి నైవేద్యాన్ని సమర్పించారు. అలాగే తల్లి పోచమ్మకు ఒడిబియ్యం పోయడానికి భక్తులు పోటీపడ్డారు. తొట్టెల కలగాలని భక్తులు అమ్మవారి గుడి పక్కన ఉన్న చెట్టుకు తొట్టెల కట్టారు. వేలాది మంది భక్తులు ముడుపులు కట్టారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.

గీతంలో కంటెంట్ రైటింగ్
వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

పటాన్‌చెరు రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్‌హెచ్‌ఎస్)లో మంగళవారం 'కంటెంట్ రైటింగ్ వర్క్‌షాప్'ను ప్రారంభించారు. మీడియా స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం నాలుగురోజుల జరగనున్నది. ఈ వర్క్‌షాప్‌ను జీఎస్‌హెచ్‌ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ గోస్మాన్‌జోస్ లాంఛనంగా ప్రారంభించి, సాంకేతికత పరిజ్ఞానం మార్పునకు అనుగుణంగా, ముఖ్యంగా కంటెంట్ రైటింగ్ వృత్తిపై కృత్రిమ మేధస్సు ప్రభావాన్ని స్వీకరించడం ప్రాముఖ్యతను వివరించారు. కెరీర్ గైడెన్స్ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ మమతారెడ్డి మాట్లాడుతూ కొత్త సాంకేతికతలను స్వీకరించడంపై ప్రముఖంగా ప్రస్తావించారు. మొదటి సెషన్ రిసోర్స్ పర్సన్‌గా జియో మారియా పాల్గొని, కంటెంట్ రైటింగ్ ప్రాథమిక అంశాలు, కంటెంట్ రకాల, ఎస్‌ఈవో టెక్నిక్ వంటి కీలక అంశాలను విద్యార్థులకు పరిచయం చేశారు. తరువాతి రెండు సెషన్లలో కంటెంట్ కమ్యూనికేషన్, వ్యక్తిగత బ్రాండింగ్ వంటి వాటిని వివరించారు. ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మండల్, మీడియా స్టడీస్ విభాగాధిపతి ఎస్ఆర్ సంజీవ్‌కుమార్ తదితరులు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

పథకాలు అనర్హులకు

(5వ పేజీ తరువాయి)

ఉండగా.. తండ్రులతో పాటే ఉంటున్న కుమారులకు ఆత్మీయ భరోసా దక్కింది. ప్రస్తుతం ఆ భూములను కుమారులే సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.కోటి పలుకుతున్నా ఏటా రూ.12వేల కోసం పోటీలు పడిన పరిస్థితి గ్రామాల్లో నెలకొన్నాయి. హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉంటున్నవారి పేర్లు జాబితాలో వచ్చాయి. జాబ్‌కార్డులు లేనివారికీ జాబితాలో పేర్లున్నాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాపై మూడు జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇల్లున్నాయి... పేర్లొచ్చాయి

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలపైనా వివాదాలు నడుస్తున్నాయి. ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వ పరంగా రూ.5 లక్షల సహాయం అందుతుంది. దీంతో సొంత ఇళ్లు, స్థలాలు ఉన్నవాళ్లంతా తప్పుడు సమాచారం ఇచ్చి జాబితాలో తమ పేర్లు వచ్చేలా ప్రయత్నం చేశారు. ఇందులో కొందరికి చోటు దక్కగా.. ఇంకొందరికి నిరాశ ఎదురైంది. మెజారిటీ గ్రామాల్లోనూ ఇళ్లున్న వారికే చోటు దక్కిందనే విమర్శలు వస్తున్నాయి. ఇంటి మంజూరు పత్రాలు పొందిన వారిలోనూ అనర్హులు బయటపడుతున్నారు. సిద్దిపేట అర్బన్ మండలంలోని ఒక చిన్న గ్రామంలో 10 మంది పేర్లు జాబితాలో ఉండగా.. ఎనిమిది మందికి సొంత ఇళ్లు ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి. ఇదే విధంగా పలు గ్రామాల్లో జాబితాలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

ఫిర్యాదుల సెల్ అవసరమే

సంక్షేమ పథకాల జాబితాల్లో అనర్హులున్నారనే విషయం తెలిసి కూడా కొన్ని చోట్ల గ్రామస్థులు బయటకు చెప్పడం లేదు. ఇలాంటి అనర్హుల గురించి బయటచెబితే తమకు ఇబ్బందులు వస్తాయని భావిస్తున్నారు. అందుకే ఒక ఫిర్యాదుల సెల్ లేదంటే టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేస్తే అనర్హుల చిట్టా బయటపడుతుంది. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసినప్పటికీ అనర్హుల జాడ తెలియకపోవచ్చు. కానీ ఆయా గ్రామస్థులకు పూర్తి వివరాలు తెలిసి ఉంటాయి. ఈ విషయంపై కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఆలోచన చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బహిరంగ ఫిర్యాదుల కంటే గుట్టుగా అనర్హులపై ఫిర్యాదులు చేయడం వల్లనే ఈ పథకాలు పారదర్శకంగా సాగుతాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

రామాయంపేట బైపాస్ వద్దేవద్దు

- అధికారులను అడ్డుకున్న భూ నిర్వాసితులు



అధికారులతో భూ నిర్వాసితుల వాగ్వాదం

రామాయంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రామాయంపేటలో బైపాస్ వద్దే వద్దంటూ భూ నిర్వాసితులు మరో మారు అధికారులను అడ్డుకున్నారు. మంగళవారం మెదక్ రహదారిలో రోడ్లు, భవనాల శాఖ అధికారులు సర్వే కోసం వచ్చారు.ఈ విషయాన్ని తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకొని అధికారులతో ఘర్షణకు దిగారు. ఇక్కడ మరో బైపాస్‌కు తమ భూములు ఇచ్చేదే లేదని, సర్వే చేపట్టొద్దంటూ అడ్డుకోవడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

నేడు సిద్దిపేటకు విద్యుత్ అధికారులు

సిద్దిపేట టౌన్, జనవరి28(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలంలో పెరిగే విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా చేపట్టిన కార్యాచరణను పరిశీలించేందుకు విద్యుత్ అధికారులు, నోడల్ అధికారులు బుధవారం సిద్దిపేటలో పర్యటించనున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ టీఆర్ చంద్రమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో చేపట్టిన వేసవి కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పనులు సకాలంలో పూర్తి చేయడంతో పాటు, జిల్లా పరిధిలో జరిగే విద్యుత్ సరఫరా తీరుతెన్నులను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా నోడల్ అధికారిగా కె సాయిబాబా డైరెక్టర్ కమర్షియల్‌ను నియమిస్తూ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ ఐఏఎస్ ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

జిల్లాలోని మున్సిపాలిటీల్లో.. వందశాతం పన్నులు వసూలు చేయాలి

● అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్


మున్సిపల్ అధికారుల సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో వందశాతం పన్నులు వసూలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో మున్సిపల్ కమిషనర్, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఫిబ్రవరి పూర్తయ్యేలోగా పన్ను వసూళ్లు పూర్తి చేసేలా మున్సిపల్ సిబ్బంది పనిచేయాలన్నారు. పన్ను వసూలు కోసం మెప్మా అధికారులు ఇతర సిబ్బంది సైతం పనిచేయ్యాలని సూచించారు. రోజువారిగా పారిశుధ్య కార్యక్రమాల పర్యవేక్షణ తీరులోనే పెండింగ్ బకాయిలను సైతం వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్లని ఆదేశించారు. కార్యక్రమంలో గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల మున్సిపల్ కమిషనర్లు నర్సయ్య, రమేష్, మల్లికార్జున్, నాగేందర్, మెప్మా పీడీ హనుమంత్ రెడ్డి, సిద్దిపేట్ మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేములఘాట్‌లో ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం


సత్తయ్య(ఫైల్)

గజ్వేల్ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరేసుకుని మృతి చెందిన ఘటన గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీ వేములఘాట్‌లో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. గజ్వేల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తలమైన సత్తయ్య(45)కు భార్య రేఖ కొడుకు నవీన్ ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా రెండేళ్ల నుంచి భార్య పుట్టింట్లో ఉంటున్నది. కొడుకు చేర్యాల గురుకుల హాస్టల్‌లో ఉండి చదువుతున్నాడు. ఒంటరిగా ఉంటూ, మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనోవేదనకు గురైన సత్తయ్య ఆదివారం రాత్రి ఇంటో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు భార్య రేఖకు సమాచారం అందించారు. భార్య వచ్చి చూసేసరికి ఇంట్లో ఉరేసుకుని వేలాడుతూ సత్తయ్య మృతదేహం కనిపించింది. ఈ సమాచారమందుకున్న పోలీసులు మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

రెండు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు


గాయపడిన జగ్గయ్య, నర్సవ్వ, నరసింహాచారి

చేర్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్త్యాల శివారు సలాక్‌పూర్ క్రాస్‌రోడ్డు సమీపంలో మంగళవారం చోటుచేసుకున్న రెండురోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు గాయాలపాలయ్యారు. సలాక్‌పూర్ గ్రామానికి చెందిన మొగుల్ల జగ్గయ్య తన భార్య నర్సవ్వతో కలిసి చేర్యాల నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ముస్త్యాల గ్రామానికి చెందిన పెడుతల రోహిత్ సలాక్‌పూర్ నుంచి ముస్త్యాలకు వస్తుండగా, మూలమలుపువద్ద రెండు బైక్‌లు ప్రమాదవశాత్తు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, స్థానికులు గమనించి ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. జగ్గయ్య, నర్సవ్వలకు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందగా, బలమైన గాయాలైన రోహిత్‌ను సిద్దిపేటకు తరలించారు. దాదాపు 3 గంటల వ్యవధిలో అదే క్రాస్‌రోడ్డు వద్ద చోటుచేసుకున్న మరో ఘటనలో రెండు బైక్‌లు ఢీకొని నరసింహాచారి, రామపదం అనే ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. తలకు బలమైన గాయాలైన నరసింహాచారిని చికిత్స నిమిత్తం సిద్దిపేటకు తరలించారు.

మల్లన్నసాగర్ నీటిని విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కు వినతులు


మంత్రి ఉత్తమ్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేస్తున్న టీపీసీసీ మాజీ సభ్యుడు మద్దుల సోమేశ్వర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి28(ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజకవర్గానికి మల్లన్నసాగర్ ద్వారా నీటిని విడుదల చేయాలంటూ బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు మద్దుల సోమేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసిన దుబ్బాక ఎమ్మెల్యేకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటివిడుదలకు హామీనివ్వడంతోపాటు ఆయన సమక్షంలోనే నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. కూడవెల్లి జాతర సందర్భంగా లక్షలాది మంది భక్తులు కూడవెల్లి క్షేత్ర దర్శనానికి వచ్చి, పుణ్యస్నానాలు చేస్తారనీ, ఇక్కడి ప్రాంత ప్రజలకు మాఘస్నానాలు ఆచరించడం అనవాయితీ అని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే యాసంగి పంటకు నీరందించేందుకు కూడా నీటిని విడుదల చేయాలని కోరారు. ఇక్కడి ప్రజలు నీటివిడుదల చేపడుతుందనే ఆశతో నాట్లు వేశారని, పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. అలాగే దుబ్బాక నియోజకవర్గంలోని ప్రతీ గుంటకు సాగు నీరందించేలా పంటకాల్వలను పూర్తిచేయాలనీ, అందుకు సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలివ్వాలని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి తగినవిధంగా సహకరిస్తానని హామీనిచ్చారు. తక్షణమే నీటిని విడుదల చేసేందుకు ఆదేశాలు జారీ చేస్తున్నట్టు తెలిపి, సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. గత వారం రోజుల క్రితం జిల్లా మంత్రి కొండసురేఖా కూడా మల్లన్నసాగర్ నీటిని విడుదల చేసిన తరువాత రెండు రోజులకే వాటిని నిలుపుదల చేశారు. ఈవిషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి నీటివిడుదలను పునరుద్ధరించారు.

మంత్రిని కలిసిన ఎంఎస్ఆర్

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టీపీసీసీ మాజీ సభ్యుడు మద్దుల సోమేశ్వర్‌రెడ్డి బుధవారం కలిసి, మల్లన్నసాగర్ నీటివిడుదలను పునరుద్ధరించాలని కోరారు. ఈ మేరకు ఆయన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. నీటి విడుదలను పునరుద్ధరించిన మంత్రికి సోమేశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అపరిచితులను నమ్మి మోసపోవద్దు


సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి

నంగునూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దని సిద్దిపేట సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎస్.స్వాతిరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని నర్మెట కేజీబీవీ విద్యార్థినులతో పాటు, హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన సదస్సులో చట్టాలపై అవగాహన కల్పించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా కోర్టుకు వచ్చి ఉచితంగా న్యాయం పొందవచ్చన్నారు. బాలల చట్టాలపై ,హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ సీఐ ఎం శ్రీను, రాజగోపాల్ పేట ఎస్ఐ ఎండీ ఆసిఫ్, సీనియర్ న్యాయవాది సాదుల ఆత్మరాములు, కేజీబీవీ ఇన్‌చార్జి ప్రత్యేక అధికారి అమీదా బేగం, మాజీ ఎంపీటీసీ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారక్షణే ధ్యేయంగా విధులు నిర్వర్తించాలి


వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివరాలను అడిగి తెలుసుకుంటున్న సీపీ

సిద్దిపేట క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలనీ సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం సీపీ సిద్దిపేట వన్ టౌన్, మహిళా పోలీస్ స్టేషన్, టాస్క్‌ఫోర్స్ కార్యాలయాన్ని సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్, రికార్డ్ రైటర్ రూమ్‌ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల రక్షణ ధ్యేయంగా పోలీసులు విధులు నిర్వహించాలని, విలేజ్ పోలీస్ ఆఫీసర్ తనకు కేటాయించిన గ్రామాలు, వార్డులను తరచుగా సందర్శిస్తూ సమాచార వ్యవస్థను మెరుగుపరుచుకోవాలని సూచించారు. మహిళా పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి మహిళా పోలీస్ స్టేషన్‌కు వచ్చే వివిధ రకాల దరఖాస్తులను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్, సీఐ వాసుదేవరావు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ పాల్గొన్నారు.

గంజాయితో పోలీసులకు పట్టుబడిన బీహార్‌వాసి


నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

కుకునూరుపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గంజాయిని విక్రయించే యత్నంలో ఉన్న బీహార్‌వాసిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన సుధీర్‌కుమార్(26) 3 నెలల క్రితం కూలీ పని కోసం మెదినీపూర్‌లోని సంతోష్ కుమార్ డైరీలో చేరాడు. అంతకుముందు నుంచే గంజాయి సేవించే అలవాటు ఉన్న సుధీర్‌కుమార్ తెలంగాణకు వచ్చేటప్పుడు బిహార్‌లో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయిని కొనుగోలు చేసి మెదినీపూర్‌లో పనిలో చేరాడు. కాగా స్వగ్రామానికి వెళ్లడానికి, అదేవిధంగా మరింత గంజాయి కొనుగోలు కోసం అతడివద్ద డబ్బులు లేకపోవడంతో తన వద్ద ఉన్న కొంత గంజాయిని ఇతరులకు అమ్మి ఆ డబ్బుతో ఊరికి వెళ్దామని భావించాడు. ఈ క్రమంలో ఉదయం మెదినీపూర్ పెద్దమ్మ గుడి వద్ద అతడు అనుమానాస్పదంగా సంచరిస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని అతని వద్ద ఉన్న బ్యాగుని తనిఖీ చేయగా అందులో గంజాయిని గుర్తించారు. 109 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు.

పెద్దరాజుపేటలో ఎలుగుబంటి సంచారం

చేర్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం పెద్దరాజుపేట-పోసోన్‌పల్లి గ్రామశివారులోని వ్యవసాయబావుల వద్ద ఎలుగుబంటి సంచరిస్తుండటంతో ఆయా గ్రామాల రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల శివారులోని గుట్ట సమీపంలో వ్యవసాయబావుల వద్ద తాము నిద్రిస్తుంటామని రైతులు తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున కుక్కలు అరవడంతో అప్రత్తమై పరిశీలించగా, ఓ ఎలుగుబంటి గుట్ట వైపుకు వెళ్లడాన్ని గమనించామని పలువురు రైతులు తెలిపారు. ఎలుగుబంటి సంచారంతో ఆందోళన చెందుతున్నామని, అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంటి బెడదను తొలగించాలని కోరుతున్నారు.

ఎంపీడీవో కార్యాలయ ఏర్పాటుకు భవనాల పరిశీలన

ధూళిమిట్ట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతన ఏంపీడీవో కార్యాలయం ఏర్పాటు కోసం అధికారులు అందుబాటులో ఉన్న పలు భవనాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏంపీడీవో రామ్మోహన్ మాట్లాడుతూ.. ధూళిమిట్ట మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు కోసం పలు భవనాలను పరిశీలించామని, వాటి వివరాలను ఉన్నతాధికారులకు అందచేస్తామన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సిద్దిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ఎబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఫణిందర్ అన్నారు. మంగళవారం దుబ్బాకలో ఖేలో భారత్‌క్రీడోత్సవ్ పోటీలను ఆయన ప్రారంభించారు. స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతులను పురస్కరించుకుని క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అజయ్, వివేక్, జస్వంత్, రాజశేఖర్ తదితరులున్నారు.

● చేర్యాల: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని చేర్యాల ఎస్ఐ నీరేశ్ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం చేర్యాల మండల కేంద్రంలో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ యువత, విద్యార్థులు చదువుపై దృష్టిసారించి సమాజంలో ఉత్తములుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్ కో-కన్వీనర్ చింతల పవన్‌కుమార్, బీజేపీ మండలాధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు


సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, నాయకులు

నంగునూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ విషయంలో మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం నంగునూరు లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట నియోజకవర్గంలో పదేళ్లపాటు తెలంగాణ ఉద్యమం పేరుతో బీఆర్ఎస్ నాయకులు అడుగడుగునా ప్రొటోకాల్ ఉల్లంఘించిన విషయాన్ని అప్పుడే మర్చిపోతే ఎలా అని ప్రశ్నించారు. సర్పంచ్ మొదలుకుని ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ పదవులకు సంబంధించి ప్రతీ పదవిలో తల్లికి బదులుగా కొడుకులు, భార్యకు బదులుగా భర్తలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ఆరోపించారు. ఇటీవల నిర్వహించిన నాగరాజుపల్లిలో జరిగిన గ్రామసభలో బాధ్యతగల పౌరులుగా అధికారులతో కలిసి పాల్గొన్నామని తెలిపారు. అక్కడ అధికారులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల మంజూరు ఉత్తర్వులను లబ్ధిదారులకు అందజేస్తున్నప్పుడు గ్రామ ప్రజల కోరిక మేరకు అధికారులతో పాటు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో బీ ఆర్ఎస్‌కు చెందిన పీఏసీఎస్ చైర్మన్లను గౌరవంగా చూసిన విషయం మర్చిపోవద్దన్నారు. గతంలో పదేళ్లపాటు ప్రొటోకాల్ పాటించని వారు నేడు ఫిర్యాదులకు దిగడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు తప్పెట శంకర్, ఎనగందుల యాదగిరి, సత్తయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే 'యూపీఎస్'


వర్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

గజ్వేల్/వర్గల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న కేంద్ర ఆర్థిక శాఖ యూనిఫైడ్ పెన్షన్(యూపీఎస్) విధానంపై జారీ చేసిన నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ గజ్వేల్, వర్గల్ మండలాల్లో రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. గజ్వేల్ పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, వర్గల్ మండలకేంద్రంలో ఉపాధ్యాయులు వేర్వేరుగా యూపీఎస్ నోటిఫికేషన్ పత్రాలను దహనం చేశారు. టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్, గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. కార్పొరేట్ల కోసమే యూపీఎస్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని విమర్శించారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని దశాబ్దకాలంగా తీవ్ర పోరాటం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు తలొగ్గి యూపీఎస్ విధానాన్ని తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది కేవలం షేర్ మార్కెట్లోకి నిరంతరాయంగా పెట్టుబడులు పెట్టే విధానం తప్ప, ఈ విధానంలో ఉద్యోగ ఉపాధ్యాయ కుటుంబాలకు సామాజిక భద్రత కోణం లేదని సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఈ విధానాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆలయానికి రూ.1.20 లక్షల గ్రానైట్ వితరణ

సిద్దిపేట అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం బొగ్గులోనిబండ గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ పెద్దమ్మ ఆలయానికి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు రూ.1.20 లక్షల విలువైన గ్రానైట్‌ను ను విరాళంగా అందజేశారు. మంగళవారం ముదిరాజ్ కులానికి చెందిన గ్రామ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయానికి సహాయ సహకారాలు అందించాలని హరీశ్‌రావును ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కలిసి గ్రామ పెద్దలు కోరడంతో గ్రానైట్‌ను అందజేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. అడగగానే దేవాలయానికి తన వంతుగా సహకారం అందించిన హరీష్ రావును ఆలయ కమిటీ సభ్యులు ముదిరాజ్ కుల సంఘం నాయకులు క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

స్థానికత ఆధారంగా రీ అలకేషన్ చేపట్టాలి

● టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్

గజ్వేల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానికత ఆధారంగా ఉపాధ్యాయుల రీ-అలకేషన్ చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని ముట్రాజ్‌పల్లి, ఆర్అండ్ఆర్ కాలనీ, సంగాపూర్, బాయ్స్ గర్ల్స్ హట్, బంగ్లావెంకటాపూర్, ధర్మారెడ్డిపల్లి, మక్తమాసాన్‌పల్లి, రంగంపేట, కోమటిబండ, గిరిపల్లి, జాలి గ్రామ పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జీవో 317 ద్వారా ఉపాధ్యాయులు స్థానికత కోల్పోయేలా ఇతర జిల్లాలకు కేటాయించడం అన్యాయమన్నారు. వారిని సొంత జిల్లాలకు రీ-అలకేషన్ చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పీఆర్‌సీని అమలు చేయాలన్నారు. వారితో జిల్లా కార్యదర్శి జల్లెల శ్రీనివాస్, జిల్లా కౌన్సిలర్ దమ్మని మల్లయ్య, మండలాధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, గోక విద్యాసాగర్ ఉన్నారు.

గురువన్నపేటలో క్షుద్రపూజల కలకలం

చేర్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలో మంగళవారం క్షుద్రపూజల ఆనవాళ్లు స్థానికుల్లో కలకలం రేపింది. గ్రామానికి చెందిన తుక్కోజు రవి ఇంటి ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల నిమ్మకాయలు, పసుపు, కుంకుమ ముగ్గు వేసి కోడిగుడ్డు పెట్టారు. తెల్లవారుజామున గమనించి భయాందోళన చెందారు. కాగా గతంలో గ్రామశివారులోని ప్రభుత్వ పాఠశాలలో క్షుద్రపూజల ఆనవాళ్లు ఉండగా, ప్రస్తుతం గ్రామంలోని జనావాసాల వద్ద వెలుగు చూడటంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి ఆకతాయిల పనిగా గుర్తించారు. ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

నంగునూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. మంగళవారం నంగునూరు మండలం జేపీ తండా, పాలమాకుల, రాంపూర్ గ్రామాల్లో ఎస్డీఎఫ్ నిధులతో మంజూరైన నూతన బోర్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ సహకారంతో సిద్దిపేట నియోజకవర్గానికి సుమారు రూ.22 కోట్ల నిధులు తీసుకొచ్చానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తప్పెట శంకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


'పథకాల పేరుతో వంచిస్తున్న ప్రభుత్వం'

గజ్వేల్ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల పేరిట ప్రజలను వంచిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆరోపించారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన బోయిని కరుణాకర్‌కు రూ. 60వేలు, డబ్బేట నరేష్‌కు రూ. 11వేల సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు లబ్ధిదారుల కుటుంబీకులకు ఆర్థికసాయం చెక్కులను మాదాసు శ్రీనివాస్ మంగళవారం అందజేశారు. ఆయన వెంట ప్యాక్స్ డైరెక్టర్ చాడా శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

కేంద్రమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

హుస్నాబాద్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ మంగళవారం హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజా సంఘాలు, నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకు ముందు రాస్తారోకో చేశారు. గద్దర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని, మంత్రి పదవి నుంచి ఆయనను తప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, జేఏసీ కో ఆర్డినేటర్లు, నాయకులు తదితరులున్నారు.

ఈజీఎస్ స్పెషల్ గ్రాంట్ నుంచి రూ.2 కోట్లు మంజూరు


మోదీ, బండి సంజయ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కోహెడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలంలోని 27 గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఈజీఎస్ స్పెషల్ గ్రాంట్ కింద రూ 2.20 కోట్లు నిధులు మంజూరయ్యాయని బీజేపీ మండల అధ్యక్షుడు జాలిగాం రమేష్ తెలిపారు. నిధులు మంజూరు చేసిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ చిత్రపటాలకు మంగళవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ నిధులతో గ్రామాల్లోని పలు వీధులలో సిమెంట్ రోడ్లు వేయనున్నట్టు ఆయన వివరించారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతను పాటించాలి


రాయపోల్‌లో అవగాహన కల్పిస్తున్న హెచ్‌సీ భాస్కర్‌రెడ్డి

గజ్వేల్/ హుస్నాబాద్/ రాయపోల్/ చేర్యాల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం వాహనదారులు, డ్రైవర్లకు రోడ్డు భద్రతపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ పాఠశాలకు చెందిన వాహనాల డ్రైవర్లకు గజ్వేల్ మెటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం క్రిష్టోఫర్ రోడ్డుభద్రత, నియమాలపై అవగాహన కల్పించారు. ప్రైవేటు పాఠశాలల డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను విధిగా పాటించాలని సూచించారు. కరీంనగర్‌లో రీజియన్‌లో హుస్నాబాద్ ఆర్టీసీ డిపో నుంచి ఉత్తమ డ్రైవర్లుగా ఎంపికైన బి ఎల్లయ్య, ఎస్ఆర్ కృష్ణ, ఎల్ కొమురయ్యలను కరీంనగర్ డీటీవో పురుషోత్తం, ఆర్ఎం రాజు, డీఎం వెంకటేశ్వర్లు అభినందించారు. ఉత్తమ డ్రైవర్లుగా ఎంపికైనవారికి ప్రశంసా పత్రాలతో పాటు శాలువాలతో సన్మానించారు. రాయపోల్ మండలకేంద్రంలో బస్టాండ్ వద్ద హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి, సిబ్బందితో కలిసి యువకులకు, ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. చేర్యాల పట్టణంలో ఎస్ఐ నీరేశ్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డుభద్రత మాసోత్సవాల పట్ల స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రతీవినియోగదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి ప్రయాణించాలని సూచించారు.

ఉజ్వల భవిష్యత్తును డ్రగ్స్‌తో నాశనం చేసుకోవద్దు



గజ్వేల్: డాక్టర్ శాంతిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ నిఖత్ అంజూమ్

గజ్వేల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనంలోనే డ్రగ్స్, గంజాయి బారిన పడి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిఖత్ అంజూమ్, జిల్లా వైద్య విభాగం సూపరిండెంట్ డాక్టర్ శాంతి సూచించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానామస్)లో మాదకద్రవ్యాలపై జాతీయ సేవా పథకం, నెహ్రూ యువ కేంద్ర మెదక్ జిల్లా సౌజన్యంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శాంతి మాట్లాడుతూ మాదకద్రవ్యాలు తీసుకోవడం వలన కలిగే దుష్పరిణామాలను గూర్చి వివరించారు. వారితో సిద్దిపేట జిల్లా డ్రగ్ అబ్యూసం అవేర్‌నెస్ ప్రోగ్రాం టీటీటీ పవన్, నషా ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వాహకులు మురళీ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వెంకటేశ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు తదితరులున్నారు.

కిరాణషాపుల్లో నార్కటిక్స్ డాగ్స్ తనిఖీలు

సిద్దిపేట అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి ఇతర మత్తుపదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్టు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లి సమీపంలోని కిరాణాషాపులు, పాన్‌డబ్బాలు, ఇతర అనుమానాస్పద ప్రదేశాల్లో డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చుకోవడం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. యువత తాత్కాలిక ఆనందం కొరకు జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు.